సాక్షి రంగారెడ్డి

సోమవారం। 7। అక్టోబర్। 2024



తహసీల్ ఆఫీస్ రెడీ

కడ్తాల్‌లో రెండున్నర ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

8లో▸



ఇతిహాసాలు చదివించాలి

పిల్లలకు ఇతిహాసాల గురించి తెలియపర్చాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ భాస్కర యోగి అన్నారు.

8లో▸



మెరిసిన జిల్లా జట్టు

కామారెడ్డిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో జిల్లా జట్టు మెరిసింది.

8లో▸

న్యూస్‌రీల్

గోవా రైలుకు స్వాగతం పలికిన బీజేపీ నేతలు



రైలుకు స్వాగతం పలికిన నాయకులు

షాద్‌నగర్: సికింద్రాబాద్ నుంచి షాద్‌నగర్ మీదుగా గోవాకు నూతనంగా ప్రారంభించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ రైలుకు షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, కందూరి మనోహర్‌రెడ్డి, సుధాకర్, చెట్ల వెంకటేశ్, వంశీకృష్ణ, నర్సింహ యాదవ్, మహేందర్‌రెడ్డి, ఎంకనోళ్ల వెంకటేశ్, మఠం రుషికేష్, నరేందర్‌రెడ్డి, కృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



చైర్మన్‌గా ఎన్నికైన మద్ది కరుణాకర్‌రెడ్డి

మహేశ్వరం: కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా తుమ్మలూరు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు మద్ది కరుణాకర్‌రెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సరూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో కరుణాకర్ రెడ్డిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా పి. సుధాకర్ రెడ్డి, కోశాధికారిగా ఎం.రాజు, వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్.వెంకటేశ్ గౌడ్, జె. చంద్రమోహన్ గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా లింగంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రావీణ్యం కలిగిన వారిని గుర్తించి, వారికి శిక్షణ ఇప్పించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. జిల్లాలో కబడ్డీ ఆటకు ప్రాధాన్యత పెరిగేలా చూస్తామన్నారు. తనపై నమ్మకంతో రెండోసారి ఎన్నుకున్నందుకు క్లబ్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి



షాబాద్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మండలంలోని ఆస్పల్లిగూడ గ్రామానికి చెందిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.

టీపీఎఫ్ సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పదిహేనేళ్ల ఉద్యమ ప్రయాణంలో టీపీఎఫ్ (తెలంగాణ ప్రజాఫ్రంట్) ఎన్నో ఉద్యమాలు చేపట్టిందని ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు అర్జునప్ప అన్నారు. 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 9న నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అర్జునప్ప మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రజాఫ్రంట్ మీద తీవ్ర నిర్బంధాన్ని అమలు చేశారన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఫ్రంట్ ఉనికి లేకుండా చేయాలని చూశారని ఆరోపించారు. ఫ్రంట్ నాయకులు గుండె నిబ్బరంతో ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తి చూపేందుకే సమయాన్ని వృథా చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ సుధాకర్, షాద్‌నగర్ కన్వీనర్ టీజీ శ్రీనివాస్, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో కూరగాయల సాగు	
సంవత్సరం	విస్తీర్ణం (ఎకరాల్లో)
2018–19	53,825
2019–20	59,070
2020–21	38,248
2021–22	33,669
2022–23	29,826
2023–24	24,314

ఉత్పత్తులు (టన్నుల్లో)	
సంవత్సరం	ఉత్పత్తి
2018-19	6,62,418
2019-20	6,11,785
2020-21	3,75,674
2021-22	2,63,827
2022-23	3,08,118
2023-24	2,15,145



కూరల సిరి తగ్గింది మరి

జిల్లాలో గణనీయంగా పడిపోయిన కూరగాయల సాగు

- ఖర్చులు పెరిగి ఆసక్తి చూపని రైతులు
- రియల్ వెంచర్లుగా మారుతున్న పొలాలు
- ఎగుమతి చేసే స్థాయి నుంచి దిగుమతి
- మార్కెట్లలో మండిపోతున్న ధరలు
- కొద్ది మోతాదులో సర్దుకుంటున్న జనం

ఇష్టమైన కూరతో కడుపునిండా భోజనం చేయాలనుకునే వారికి నిజంగా ఇది చేదు వార్తే. నచ్చిన కూరగాయ దొరకడం కష్టంగా మారింది. ఒకవేళ దొరికినా వాటి ధరలు చూస్తే వామ్మో అనాల్సిందే. రెండు మూడు కిలోలు కొనుగోలు చేయాలని మార్కెట్‌కు వచ్చిన వారు రేటు చూసి పావుకిలో సంచిలో వేసుకుని వెళ్తున్నారు. కూరగాయలే కాదు ఆకుకూరల ధరలు సైతం పెరిగాయి. సాగు విస్తీర్ణం తగ్గడమే ఇందుకు కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకప్పుడు ఎటుచూసినా కాయగూరలు, పండ్ల సాగుతో పచ్చగా కనిపించే జిల్లాలోని వ్యవసాయ భూములు నేడు రియల్టర్ల గుప్పిట్లో బందీ అయ్యాయి. తాజా కూరలు, పండ్లను పుష్కలంగా పండించి, నగరానికి ఎగుమతి చేసిన రైతులు ప్రస్తుతం రోజువారీ అవసరాలకు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అవు తున్న పంటలపై ఆధారపడుతున్నారు. ఏటా కూరగాయల సాగు తగ్గుతుండడం, డిమాండ్‌కు తగ్గట్టు దిగుబడి లేకపోవడంతో మార్కెట్లో ఆయా కూరగాయల ధరలు రెట్టింపు అవుతున్నాయి. షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, బాలాపూర్, హయత్ నగర్, జల్‌పల్లి, సరూర్‌నగర్, వనస్థలిపురం, మెహిదీపట్నం సహా ఏ రైతు బజార్‌లో చూసినా.. ఏ రకమైన కూరగాయ అయినా కిలో రూ.40 నుంచి రూ.60 వరకు ధర పలుకుతోంది. దీంతో కిలో కొనాలనుకునే వారు పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు.

తగ్గిన దిగుబడి

సాగు విస్తీర్ణమే కాదు దిగుబడి కూడా గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు ఎకరానికి 30 నుంచి 40 టన్నుల దిగుబడి వచ్చే పంట ప్రస్తుతం రెండు మూడు టన్నులకే పరిమితం అవుతోంది. ఆకుముడత, పచ్చపురుగు వంటి క్రిమి కీటకాలకు తోడు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదలకు పంట దిగుబడి భారీగా తగ్గింది. వర్షానికి కాయలకు మచ్చలు ఏర్పడుతున్నాయి. తాజాగా నిఘనిఘలాడాల్సిన ఈ కాయగూరలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఇష్టపడక పోవడంతో వాటిని మార్కెట్లోనే పారబోసి వెళ్లాల్సి వస్తోంది.

కరువైన ‘ప్రోత్సాహం’

కూరగాయల సాగు రైతుకు భారంగా మారింది. క్రిమి సంహారక మందులు, ఫెర్టిలైజర్ ఖర్చులు భారీగా పెరిగాయి. అనేక వ్యయ ప్రయాసలకోర్చి పంట పండిస్తే.. తీరా మార్కెట్లోకి వచ్చే సరికి ధర ఉండటం లేదు. గిట్టుబాటు కాక రైతులు వీటి సాగుకు ఆసక్తి చూపించడం లేదు. అంతేకాదు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం డ్రిప్, పాలీహౌస్‌లు, నెట్ హౌస్‌లకు ఇస్తున్న రాయితీ కూడా తగ్గించింది. రైతు ఆసక్తి చూపించకపోవడానికి ఇవి కూడా కారణం అవుతున్నాయి. కూరగాయలే కాదు పండ్ల తోటల సాగు కూడా భారీగా తగ్గింది.

ఖర్చు పెరిగింది



కూరగాయలు సాగు చేద్దామంటే కూలీల ఖర్చు భారంగా మారింది. నాకున్న 15 ఎకరాల్లో సగం వరి, మిగితా సగం వివిధ రకాల కూరగాయలు సాగు చేసేవాడిని. కూరగాయల సాగుతో వచ్చే లాభాలతో వరి పంటలో పెట్టుబడులు పెట్టేవాళ్లం. కుటుంబ అవసరాలకు డబ్బులు అందేవి. ప్రస్తుతం కూరగాయలు సాగు చేద్దామంటే దుక్కులు దున్నడం నుంచి మార్కెట్‌కు తరలించే వరకు కూలీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. గిట్టుబాటు కాకపోవడంతో సాగు బంద్ చేశాను.

– కొంగళ్ల జోగిరెడ్డి, రైతు నందివనపర్తి

రాయితీలు లేవు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కూరగాయల విత్తనాలు, సాగుకు వాడే యంత్రాలపై రాయితీ ఉండేది. పదేళ్లుగా రాయితీలన్నీ బంద్ చేశారు. నాకున్న రెండున్నర ఎకరాల పొలంలో అర ఎకరాలోనే పలు రకాల కూరగాయల పంటలు సాగు చేస్తున్నాను. అతివృష్టి, అనావృష్టితో పంటలకు నష్టం జరిగితే అప్పట్లో పరిహారం అందించేవారు. ఇప్పుడు పరిహారం దేవుడెరుగు నష్టపోయిన పంటలను చూసే వారే లేరు.

– కాశమల్ల రాములు, రైతు, చౌదర్‌పల్లి



కేన్సర్.. రన్



గచ్చిబౌలి: కేన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే కట్టడి చేయవచ్చని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో క్వాంబియంట్ గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్–2024 విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్యమే సంపద అని, తాను నిత్యం 10 కిలోమీటర్లు రన్నింగ్ చేస్తానన్నారు. కేన్సర్ మహమ్మారిపై ప్రజలను మరింత అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోనే ఇది అతిపెద్ద కేన్సర్ అవగాహన రన్‌గా ఆయన అభివర్ణించారు. రోబోటిక్ సర్జికల్ అంకాలజిస్ట్, గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చిన్నబాబు, రన్‌లో ఫరీదాబాద్‌కు చెందిన భారత తొలి బ్లేడ్ రన్నర్ కిరణ్ తనూజతో పాటు 3 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయసున్నవారు పాల్గొన్నారు.



రన్‌ను ప్రారంభిస్తున్న జెన్నిఫర్ లార్సన్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తదితరులు




కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మెట్రోరైల్ రూట్‌లో మార్పులు చేయాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి

తుక్కుగూడ: మహానగరంలో చేపడుతున్న హైదరాబాద్ మెట్రోరైల్ రెండో విడతకు సంబంధించిన కారిడార్ 04, 09లో మార్పులు చేయాలని ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ నాయకులు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగరంలోని ఆయన నివాసంలో కలిసిన వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. రెండో విడతలో మెట్రో రైలు నాగోల్‌లో ప్రారంభమై ఎల్బీనగర్, మంద మల్లమ్మ, చాంద్రాయణగుట్ట, ఆరంఘర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు (36 కి.మీ), శంషాబాద్ నుంచి ఫోర్త్‌సిటీ వరకు (40 కి.మీ).. మొత్తం 76 కిలోమీటర్ల రూట్‌ను నిర్వాహకులు ప్రకటించారని తెలిపారు. అలా కాకుండా ఎల్బీనగర్, మంద మల్లమ్మ, బాలాపూర్ చౌరస్తా, ఆర్‌సీఐ, మహేశ్వరం గేటు నుంచి ఫోర్త్‌సిటీ వరకు కేవలం 41 కిలోమీటర్లలో లైన్ పూర్తి చేయొచ్చని అన్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి వ్యయం తప్పడంతో పాటు మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రోరైల్ ఎండీని సైతం కలుస్తామని వెల్లడించారు. వినతిపత్రం అందజేసిన వారిలో తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగేల హేమలత, మాజీ చైర్మన్ కె.మధుమోహన్, పార్టీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



❖ బల్కంపేట ఎల్లమ్మ సన్నిధిలో కేంద్రమంత్రి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బల్కంపేట ఎల్లమ్మను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం అమీర్‌పేట జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సినీ నటుడు గోపీచంద్ బల్కంపేట అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల్లో బీజేపీ సీనియర్ నేత బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, ఆలయ ఈఓ కృష్ణ, ఛైర్మన్ సాయిబాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. – అమీర్‌పేట

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడిన అక్షిత

శంషాబాద్ రూరల్: వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఘాంసిమియాగూడలో ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామంలో నీరటి రాజు కూతురు అక్షిత(4) ఇంటి ముందు ఆడుకుంటుండగా.. వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడో

- లాగిన్ పునః ప్రారంభానికి లభించని గ్రీన్ సిగ్నల్
- సర్కిల్ ఆఫీసులు, మీ సేవ కేంద్రాల చుట్టూ పేదల చక్కర్లు

సాక్షి, సిటీబ్యూరో: ఈసారి కూడా కొత్త రేషన్ కార్డులకు మోక్షం లభించే పరిస్థితి కనిపించడం లేదు. అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించిన సర్కారు.. నాలుగు రోజులు దాటినా ఆన్‌లైన్ లాగిన్ పునఃప్రారంభానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు రెండు రోజుల క్రితం ఫ్యామిలీ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టుగా అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక కాలనీ చొప్పున సర్వేకు శ్రీకారం చుట్టడంతో ఇప్పట్లో కొత్త రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ లేనట్లుగానే తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన పది మాసాల నుంచి ప్రజలను ఆశల పల్లకిలో విహరింపజేస్తోంది. తాజాగా పరిస్థితి చివరి దశకు వచ్చినట్లు పేదలు భావించినా.. తిరిగి అదే పరిస్థితి పునరావృతమవుతోంది. నిరుపేదలు మాత్రం సర్కిల్ ఆఫీసులు, మీ సేవ కేంద్రాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. సివిల్ సప్లయ్ అధికారులకు సైతం స్పష్టత కరువైంది.

ఎదురుచూపులే..

గ్రేటర్ పరిధిలో ఏళ్ల తరబడి కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. మొత్తమ్మీద సుమారు పది లక్షలపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు లేనట్లు తెలుస్తోంది. ఉపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు పెద్దఎత్తున ఇక్కడే స్థిరపడిపోయారు. దాదాపు కోటిన్నర జనాభా కలిగిన మహా నగరంలో సుమారు 40 లక్షల కుటుంబాలు ఉండగా అందులో దారిద్ర్య రేఖకు దిగువన 27.21 లక్షలు వరకు ఉన్నట్లు అంచనా. అందులో 17.21 లక్ష కుటుంబాలు మాత్రమే తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. మిగతా కుటుంబాలు రేషన్ కార్డులు లేక సంక్షేమ పథకాలు వర్తించక ఆందోళన చెందుతున్నారు.

పదేళ్లలో 1.21 లక్షలు మాత్రమే..

మహా నగర పరిధిలో పదేళ్లలో కొత్తగా మంజూరైన కార్డులు 1.21 లక్షలు మాత్రమే. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తెల్లరేషన్ కార్డులను ఆహార భద్రత కార్డులుగా మార్పు చేయడంతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇబ్బడిముబ్బడిగా ప్రభుత్వం మంజూరు చేసింది. కొంత కాలానికి అనర్హుల పేరిట కొన్ని కార్డులను ఏరివేసి కార్డుల సంఖ్యను 15,99,639 కుదించారు. దీంతో తిరిగి కొత్త కార్డుల కోసం సుమారు 3.40 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకోగా.. మూడున్నరేళ్ల క్రితం 360 డిగ్రీల స్థాయిలో వడబోసి దరఖాస్తులను మొక్కుబడిగా ఆమోదించి కొత్త కార్డులు మంజూరు చేసి చేతులు దులుపుకొంది.

డాటా ఎంట్రీ కాని దరఖాస్తులు

ఇప్పటికే సుమారు 5.73 లక్షల కుటుంబాలు కొత్త కార్డుల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాయి. అవి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు కావడంతో కనీసం డాటా ఎంట్రీ కూడా కానట్లు తెలుస్తోంది. పౌరసరఫరాల శాఖ ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఆ శాఖ పరిగణనలోకి తీసుకోనట్లు సమాచారం.

గిర్రున మీటర్



గ్రేటర్‌లో అక్టోబర్‌లో విద్యుత్ డిమాండ్ (మెగావాట్లలో)..			
తేదీ	2023	2024	పెరుగుదల
01	2,647	3,417	29.09%
02	2,734	3,118	14.05%
03	3,148	3,398	7.94%
04	3,116	3,279	5.23%
05	3,135	3,188	4.55%

విద్యుత్ వినియోగం ఇలా.. (మిలియన్ యూనిట్లలో)			
తేదీ	2023	2024	పెరుగుదల
01	56.02	70.90	26.65%
02	56.20	65.02	15.69%
03	63.20	70.02	10.79%
04	64.42	69.27	7.53%

విద్యుత్ వినియోగం పైపైకి

- రోజుకు సగటున 70 ఎంయూలు నమోదు
- సాయంత్రం వర్షం.. తెల్లవారుజామున ఉక్కపోత
- కొద్దిరోజులుగా విభిన్న వాతావరణం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం ఎండకు ఉక్కపోత తోడవుతోంది. సాయంత్రం అనూహ్యంగా మేఘావృతం అవుతోంది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఒకే రోజు భిన్నమైన వాతావరణం నెలకొంటోంది. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఈసారి పగటి ఉష్ణోగ్రతలు కూడా తక్కువే. ఉక్కపోతకు దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఫలితంగా వర్షాకాలంలోనూ రోజంతా ఏసీలు, ఫ్యాన్లు ఆన్‌లో ఉంచాల్సి వస్తోంది. విద్యుత్ మీటర్లు గిరగిరా తిరుగుతూ నెలవారీ బిల్లు పెరుగుదలకు కారణమవుతున్నాయి. ప్రస్తుతం గ్రేటర్‌లో 62 లక్షల కనెక్షన్లు ఉండగా, వీటిలో 51 లక్షల గృహ, 7 లక్షలకుపైగా వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. మిగిలిన వాటిలో పారిశ్రామిక, ఇతర కనెక్షన్లు ఉన్నాయి. గత ఏడాది అక్టోబర్ మొదటి వారంతో పోలిస్తే.. ప్రస్తుతం రోజూ ఏదో ఒక ప్రాంతంలో వర్షం కురుస్తూనే ఉంది. వీధుల్లో వరదలు పోటెత్తుతూనే ఉన్నాయి. ఉక్కపోతకు తోడు దోమల మోత ఎక్కువైంది. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో నమోదు కావాల్సిన విద్యుత్ వినియోగం.. వర్షాకాలంలో నమోదవుతుండటం ఆందోళన కలిస్తోంది. సెప్టెంబర్ 20న ఏకంగా 72.19 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదు కావడం గమనార్హం. ఏకధాటి వర్షాలకు తోడు విద్యుత్ వినియోగం భారీగా నమోదవుతుండటంతో ఫీడర్లపై ఒత్తిడి పెరిగి తరచూ ట్రిప్పవుతూ.. సరఫరాలో అంతరాయం కలుగుతోంది.

చర్లగూడవాసికి అంబేడ్కర్ జాతీయ అవార్డు


తిరుపతిలో అవార్డు అందుకుంటున్న ఆంజనేయులు

షాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన సేవలు మరువలేనివని బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 8వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో షాబాద్ మండలం చర్లగూడ గ్రామానికి చెందిన చొక్కంపేట ఆంజనేయులుకు అంబేడ్కర్ జాతీయ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బీఎస్ఏ ఆధ్వర్యంలో ఏటా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆంజనేయులు మాట్లాడుతూ.. నవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా బహుజన సాహిత్య అకాడమీ ముందుకు పోతుందన్నారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఎస్ఏ కార్యదర్శి విష్ణువర్ధన్, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో ఇతిహాసాలు చదివించాలి

ఆధ్యాత్మికవేత్త డాక్టర్ భాస్కరయోగి



చేవెళ్ల: మన దేశ సంస్కృతి సంప్రదాయలను భావి తారలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ భాస్కర యోగి అన్నారు. మండల కేంద్రంలో హిందూ ధార్మిక సమితి చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీమద్రామాయణ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే పిల్లలకు తల్లిదండ్రులు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలు చదివించాలని సూచించారు. ప్రపంచ దేశాలన్నింటిలో భారత దేశ చరిత్ర ఎంతో ప్రాచీనమైనదని తెలిపారు. అనేక దేశాల చరిత్రలు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ భారత చరిత్ర మాత్రం ఇప్పటికీ వర్ధిల్లుతుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయలను మనమే కాపాడుకోవాలన్నారు. మారుతున్న కాలంలో మన ఇతిహాసాల గురించి మరిచి పోయే ప్రమాదం ఉందని అందుకే వాటిని మన పిల్లలకు గుర్తు చేస్తే భావితరాలకు వీటి గురించి తెలుస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలన్నారు. మానసిక ప్రశాంతత ఉంటేనే ఏదైనా సాధించ వచ్చన్నారు. ప్రవచనాల ప్రారంభంలో ఇటీవల విడుదలైన నీట్ పరీక్షలో ప్రతిభ చాటి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉచిత సీటు సాధించిన ఇందు ఆమె తల్లిదండ్రులను హిందూ ధార్మిక సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండలంలోని పెద్దలు, ప్రజలు, పాల్గొన్నారు.

మద్యం మత్తులో బస్సుకు ఎదురెళ్లి..

జీడిమెట్ల: మద్యం మత్తులో ఓ వ్యక్తి కావాలని బస్సుకు గుద్దుకుని మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెల్పిన వివరాల ప్రకారం.. ఆదివారం ఓ వ్యక్తి (25–30) పూటుగా మద్యం సేవించి రోడ్డుపై వస్తున్న వాహనాలకు అడ్డుగా వెళ్తున్నాడు. ఇది గమనించిన మహ్మద్ అబ్బాస్ అనే వ్యక్తి అతన్ని రోడ్డు పక్కకు తీసుకువచ్చి అక్కడ కూర్చోబెట్టాడు. సదరు గుర్తు తెలియని వ్యక్తి తిరిగి మద్యం మత్తులో రోడ్డుకు అడ్డంగా పరుగెత్తాడు. అదే సమయంలో కాచిగూడ డిపోకు చెందిన బస్సు (ఏపీ11 జెడ్2703) బాలానగర్ నుండి గండిమైసమ్మ వైపు వెళ్తుంది. సదరు వ్యక్తి వేగంగా వెళ్లి బస్సు ఎడమవైపుకు తాకి కిందపడి బస్సు కిందకు దొర్లాడు. దీంతో చాతికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అబ్బాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పై ఫోటోలోని వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే జీడిమెట్ల పీఎస్ పరిధిలో సంప్రదించాలని పోలీసులు కోరారు. కాగా ఈ సంఘటనలో తన తప్పేమీ లేదని ఆర్టీసీ డ్రైవర్ పేర్కొన్నాడు.

తహసీల్ ఆఫీస్ రెడీ

- నేడు ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఎనిమిది ఏళ్లుగా పాలకేంద్రంలో కొనసాగిన కార్యాలయం


ప్రారంభానికి సిద్ధమైన తహసీల్దార్ కార్యాలయం

కడ్తాల్: మండల కేంద్రంలో రెండున్నర ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కడ్తాల్ మండలంగా అవతరించిన నాటి నుంచి తహసీల్దార్ కార్యాలయం స్థానిక పాలశీతలీకరణ కేంద్రంలోని రైతు భవనంలో నిర్వహిస్తున్నారు. భూ సమస్యలు అధికంగా ఉన్న మండలం కావడంతో తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులతో పాటు కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో అనేక భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు తరచూ కార్యాలయానికి వస్తుంటారు. కార్యాలయం వద్ద ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో చెట్ల కిందనే పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొని ఉండేది. సమస్యను స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. నూతన కార్యాలయ ఏర్పాటుకు 2021లో రూ.68 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేశారు.

రెండున్నరేళ్లుగా పనులు

ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నగదు చాలక పోవడంతో భవన నిర్మాణ పనులను మధ్యలోనే వదిలేశారు. ఇదిలా ఉండగా స్థానికంగా ఉన్న అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించి, భవన నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం అసంపూర్తి కార్యాలయ నిర్మాణ పనులకు అదనంగా మరో రూ.50 లక్షలు మంజూరు చేసింది. దీంతో పనులు తిరిగి ప్రారంభం కావడంతో ఈ ఏడాది జూన్ నాటికి 90 శాతం మేర పూర్తయింది. చివరి దశలో నిధులు చాలకపోవడంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి సమస్య చేరింది. ఈ మేరకు జులైలో ఎమ్మెల్యే నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి పనులు పూర్తి చేసేలా కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరు చేయించారు. దీంతో కొన్ని రోజులుగా పనులు ముమ్మరంగా సాగడంతో పాటు కార్యాలయం సిద్ధమైంది.

నేడే ప్రారంభం

తహసీల్దార్ కార్యాలయాన్ని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి సోమవారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని పరిశీలించారు. ప్రారంభోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని అధికారులు, నాయకులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయం ప్రారంభించనున్న నేపథ్యంలో రైతులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల మేరకు.. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన రాజు (36) సెంట్రింగ్ లేబర్ పని చేస్తున్నాడు. ఆరాంఘర్ నుండి చంద్రాయణ గుట్ట వైపు తన స్నేహితుడు రమేష్ (50)తో కలిసి ఆదివారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో వెళ్తున్నాడు. దుర్గానగర్ సిగ్నల్ వద్ద వేగంగా దూసుకొచ్చిన లారీ బైక్ ను ఢీ కొంది. డ్రైవింగ్ చేస్తున్న రాజుపై నుండి లారి ముందు చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటన స్థలికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డుపై మురుగు.. దుర్గంధంతో పరుగు

రోడ్డుపై పారుతున్న మురుగునీటితో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని తారామతిపేట నుంచి పసుమాముల వెళ్లే దారిలో ఓఆర్ఆర్ అండర్‌పాస్ వంతెన కింద వ్యర్థ జలాలు ఏరులై పారుతున్నాయి. దీంతో పరిసరాలు దుర్గంధ భరితంగా తయారయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మురుగునీరు రహదారిపైకి చేరకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. – అబ్దుల్లాపూర్‌మెట్

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాచారం: బ్లాక్ మార్కెట్లో విక్రయించడానికి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కడ్తాల్ మండలం పల్లెచల్కతండాకు చెందిన కృష్ణ మండలంలోని పలు గ్రామాల్లో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి ఆటోలో తన స్వగ్రామానికి తరలిస్తున్నారు. వాహనాల తనిఖీలో ఆదివారం యాచారం పోలీసులు మండల కేంద్రంలో ఆటోను పట్టుకుని, అందులో ఉన్న రేషన్ బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మాల్‌లోని వీటీనగర్‌కు చెందిన భాస్కర్(40) శనివారం రాత్రి నల్గొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రం నుంచి ఆటోలో మండల పరిధిలోని మాల్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో మాల్ గ్రామ పంచాయతీ సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న భాస్కర్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో దుర్గా మాత ఆలయం వద్ద దేవీన వరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్‌లు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎంపీపీ మల్లేష్‌ముదిరాజ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు జగదీష్, మార్కెట్ కమిటి డైరెక్టర్ రాజునాయక్ పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో మెరిసిన జిల్లా జట్టు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఫ్రాబెల్స్ హైస్కూల్ మైదానంలో రెండురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో రంగారెడ్డి జిల్లా, ద్వితీయ స్థానంలో ఆదిలాబాద్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో హైదరాబాద్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు నిలిచాయి. విజేతలకు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పీవీ రమణ, జిల్లా అధ్యక్షుడు ఎల్.నర్సింగరావు, కోశాధికారి చిన్నయ్య, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణమూర్తి, రైల్వే కోచ్ శశి కప్‌లు అందించారు.


రంగారెడ్డి బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

క్రమశిక్షణకు మారుపేరు ఆర్‌ఎస్‌ఎస్

శంషాబాద్: క్రమశిక్షణకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మారుపేరులాంటిందని హిందూవికాస్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి రఘునాథ్ రెడ్డి అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిశుమందిర్ పాఠశాల నుంచి ఆర్‌బీనగర్ హనుమాన్ మందిరం మైదానం వరకు పథసంచలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 99 ఏళ్లుగా ఆర్‌ఎస్‌ఎస్ జాతీయసమైక్యత, నిస్వార్థ సేవాభావాలను నిర్మాణం చేస్తోందన్నారు. అనంతరం ఆయుధపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ఆయుష్, మల్‌రెడ్డి బల్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతురి అదృశ్యం


చిన్నారితో స్వప్న (ఫైల్)

మొయినాబాద్: హోటల్‌లో హౌస్‌కీపింగ్‌గా పనిచేసే మహిళతోపాటు ఏడాది వయసున్న కూతురు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్ద మంగళారం గ్రామానికి చెందిన మొగుల్లం సంజయ్ భార్య స్వప్న(21) మొయినాబాద్‌లోని ఓ హోటల్‌లో హౌస్‌కీపింగ్‌గా పనిచేస్తుంది. రోజు మాదిరిగానే శనివారం ఆమె పనికి వెళ్లింది. రాత్రి 7 గంటలకు భార్యను తీసుకురావడానికి సంజయ్ హోటల్ వద్దకు వెళ్లాడు. అయితే ఆమె 6.40కే నగరంలో ఉండే తమ బాబాయ్ వద్దకు పాపను తీసుకుని వెళ్లినట్లు హోటల్ యజమాని చెప్పారు. అయితే ఆమె అక్కడకు వెళ్లలేదు. ఇతర బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం మొయినాబాద్ ఠాణాలో సంజయ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నవ వధువు అదృశ్యం


అర్చన (ఫైల్)

పహాడీషరీఫ్: నవ వధువు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి గ్రామానికి చెందిన యంజాల పెద్దిరాజ్ వివాహం ఏడు నెలల క్రితం అర్చనతో జరిగింది. పెళ్లైన మూడు నెలల వరకు సజావుగానే సాగిన వీరి దాంపత్య జీవితం.. అనంతరం ఆమె భర్తను దూరం పెడుతూ వచ్చింది. తరచూ వేరే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడేది. ఈ క్రమంలోనే ఈ నెల 1న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బంగారు నగలు, దుస్తులు తీసుకొని వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నవ్యనాటక సమితి కృషి అభినందనీయం


నృత్య గురువులను సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

నాంపల్లి: భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే శాస్త్రీయ సంగీత, నృత్య రీతుల్లో జాతీయ స్థాయిలో 1961 నుంచి పోటీలు నిర్వహిస్తూ యువ కళాకారులను ప్రోత్సహిస్తున్న నవ్య నాటక సమితి కృషి అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. ఆదివారం మాసబ్‌ట్యాంక్ నఫీజ్ రెసిడెన్సీ గాయత్రీ సదనంలో నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 49వ జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీల అభినందన సభ జరిగింది. పోటీల నిర్వాహణలో ముఖ్య భూమిక పోషించిన నృత్య గురువులు నిష్టల సుధామాల, డాక్టర్ ఇందిరా హేమలను ఆయన సత్కరించారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన యువ కళాకారులను ఒకే వేదికపైకి చేర్చడం ద్వారా జాతీయ సమైక్యతకు, సమగ్రతకు తోడ్పడటం అభినందనీయమన్నారు. యువ కళాకారులు దేశ సాంస్కృతిక రాయబారులన్నారు. 49వ రాష్ట్ర ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకురాలు డాక్టర్ వసుంధర మాట్లాడుతూ.. సంగీత నృత్య పోటీల్లో పాల్గొనే ఔత్సాహిక కళాకారులే కాక గురువులు కూడా అనేక విషయాలు నేర్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నృత్య గురువులు మధుమతి కులకర్ణి, వి.వాణీ రమణ, ఆచార్య ఏలేశ్వరపు చలపతి శాస్త్రి, నవ్య నాటక సమితి అధ్యక్షులు వేమరాజు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హత్య చేసి 8 నెలలకు చిక్కాడు!

- ఈ ఏడాది జనవరి 31న వృద్ధురాలి హత్య
- సొత్తు కోసం చంపేసిన ఇద్దరు బిహారీలు
- గాలించి పట్టుకున్న నగర టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: బీహార్‌లోని మధుబిన జిల్లాలో ఉన్న సుజోల్ గ్రామం...నేపాల్ సరిహద్దుకు కేవలం 35 కిమీ దూరంలో ఉన్న ఈ ఊరు నేరగాళ్లకు కేరాఫ్ అడ్రస్. దేశ వ్యాప్తంగా వివిధ నగరాలకు వలస వెళ్లే ఈ గ్రామస్తులు పనివారుగా చేరతారు. నమ్మకంగా ఉంటూ గొంతు కోసి ఉడాయిస్తారు. ఇదే పంథాలో దోమలగూడ పరిధిలో వృద్ధురాలిని చంపి, సొత్తు, సొమ్ము దోచుకుపోయిన ఇరువురు సుజోల్ వాసులు ఎనిమిది నెలలు అజ్ఞాతంలో ఉన్నారు. వీరి కోసం ముమ్మరంగా గాలించిన మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు కీలక నిందితుడిని శనివారం అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపారు. సుజోల్‌కు చెందిన మహేష్‌కుమార్ ముఖియా 2023 డిసెంబర్ నగరానికి వలసవచ్చాడు. తన సోదరి వద్ద ఉంటూ..స్నేహితుడి ద్వారా దోమలగూడకు చెందిన సువర్ణ పవన్ గుప్త ఇంట్లో కేర్ టేకర్‌గా చేరాడు. గుప్త తల్లి స్నేహలత దేవి (62) వయసు రీత్యా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆమెకు సపర్యలు చేస్తూ నమ్మకం సంపాదించుకున్నాడు. గుప్తతో పాటు ఆయన కుటుంబీకులు ప్రతి రోజూ తమ వ్యాపార కార్యకలాపాల కోసం ఉదయం వెళ్లి రాత్రికి తిరిగి వస్తుంటారు. ఆ సమయంలో స్నేహలత మాత్రమే ఇంట్లో ఉంటుంది. ఈ విషయం తెలిసిన మహేష్ ఆమెను బంధించి, ఇంట్లో ఉన్న సొమ్ము, సొత్తు కాజేయాలని పథకం వేశాడు. దీనికి సహకరించడానికి తన స్వగ్రామానికే చెందిన మనోజ్ ముఖ్యాను పిలిపించుకున్నాడు. ఈ ఏడాది జనవరి 27న వచ్చిన ఇతగాడు మహేష్ వద్దే ఉన్నాడు. వృద్ధురాలిని బంధించడానికి, నోటికి వేయడానికి అవసరమైన తాళ్లు, టేపు తదితరాలతో పాటు ఓ బ్యాగ్‌ను ఖరీదు చేశాడు. జనవరి 31న ఎప్పటిలానే పనికి వచ్చిన మహేష్..కుటుంబీకులు అంతా బయటకు వెళ్లిన తర్వాత మనోజ్‌ను రప్పించాడు. ఆ సమయంలో హాలులోని సోఫాను ఆనుకుని కూర్చున్న స్నేహలతపై ఇరువురూ దాడి చేశారు. ఆమె నోట్లో వస్త్రాలు కుక్కడంతో పాటు ప్లాస్టర్ వేశారు. కాళ్లు, చేతులు కుర్చీకి కట్టి అల్మారాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులు తీసుకుని ఉడాయించారు. ఈ సొత్తును పంచుకున్న నిందితులు ఎవరిదారిని వాళ్లు నగరం వదిలి పరారయ్యారు. మహేష్ కుమార్ సిటీ నుంచి ఢిల్లీ వెళ్లి అట్నుంచి గోవా చేరుకున్నాడు. దాదాపు మూడు నెలల తర్వాత తన గ్రామానికి వెళ్లి మళ్లీ ఢిల్లీకి వచ్చాడు. స్నేహలత హత్యపై దోమలగూడ ఠాణాలో కేసు నమోదైంది. ఈ నిందితుల కోసం మధ్య మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామకృష్ణ నేతృత్వంలో ఎస్సై సీహెచ్ నవీన్‌కుమార్ నేతృత్వంలోని బృందం రంగంలోకి దిగింది. ఎనిమిది నెలల నుంచి మహేష్, మనోజ్‌ల కదలికలపై నిఘా ఉంచింది. ఎట్టకేలకు మహేష్ నగరానికి వచ్చాడని, మరో ఇంట్లో పనిలో చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని తెలుసుకుని పట్టుకుంది. పరారీలో ఉన్న మజోన్ కోసం గాలింపు కొనసాగిస్తోంది. మధుబని జిల్లాకు చెందిన అనేక మంది ఇలానే దేశ వ్యాప్తంగా నేరాలు చేస్తున్నారని, తమ 'పని' పూర్తయిన తర్వాత నేపాల్ పారిపోతున్నారని అధికారులు చెప్తున్నారు. ఎవరినైనా పనిలో చేర్చుకునే ముందు పూర్వాపరాలు పరిశీలించాలని కోరుతున్నారు.